సాక్షి నిజామాబాద్

సోమవారం । 28 । జూలై । 2025

ఘనంగా తీజ్

బంజారాల ఆధ్యాత్మిక వేడుక తీజ్ పండగను జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గిరిజన ఆడపడుచులు గోధుమ బుట్టలకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి ఊరేగించారు.

సిరికొండ మండలం సర్పల్లి తండాలో గోధుమ బుట్టలతో గిరిజన యువతులు



న్యూస్‌రీల్

నేడు పీసీసీ చీఫ్ రాక

- వనమహోత్సవం, రేషన్‌కార్డుల పంపిణీ

నిజామాబాద్ సిటీ: పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్‌తో కలిసి సోమవారం జిల్లాకేంద్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు తెలిపారు. ఉదయం గంగాస్తాన్ ఫేస్–1లోని మారుతీనగర్ పార్కులో వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటుతారని పేర్కొన్నారు. అనంతరం జెండా బాలాజీ, శంభునిగుడి, హమల్‌వాడీ సాయిబాబా ఆలయాల నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాల్లో పాల్గొనున్నారు. మధ్యాహ్నం రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు కొత్తరేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కార్యకర్తలు, పార్టీ నాయకులతో సమావేశమవుతారని తెలిపారు.

జానకీబాయి చెరువు పరిశీలన



ఇందల్వాయి: సిర్నాపల్లి గ్రామంలోని జానకీబాయి చెరువును తహసీల్దార్ వెంకట్రావు, ఎస్సై సందీప్ ఆదివారం పరిశీలించారు. చెరువు వద్ద శనివారం రాత్రి ముగ్గురు యువకులు వరదలో చిక్కుకున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వీడీసీ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. సందర్శకుల తాకిడి ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, అవసరమైతే అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు సందర్శకులెవరూ రావొద్దని, అప్పటి వరకు రోడ్డు మార్గం మూసివేస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీపీ

ఖలీల్‌వాడి: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాలలో వరద ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. మత్తడి పోస్తున్న చెరువుల కింది భాగానికి ఎవరూ వెళ్లొద్దని తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. విద్యుత్ తీగలు తెగినచోట దూరంగా ఉండాలని, పిల్లలను ఒంటరిగా, స్నేహితులతో ఈతకు పంపవద్దని తల్లిదండ్రులకు సూచించారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ద్విచక్ర వాహనాదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజల కోసం నిర్విరామంగా కృషి చేసేందుకు పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్నారు.

ప్రశాంతంగా జీపీవో, సర్వేయర్ల పరీక్ష

- సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్‌అర్బన్: గ్రామ పాలన అధికారులు (జీపీవో), లైసెన్స్ డ్ సర్వేయర్ల నియామకానికి ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగిన జీపీవో పరీక్షకు 60 మంది అభ్యర్థులకు గాను 46 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షల్లో భాగంగా ఉదయం సెషన్ 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన థియరీ పరీక్షకు 305 మంది అభ్యర్థులకు గాను 271 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెకండ్ సెషన్ ప్రశాంతంగా జరిగింది. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు నడుమ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహిస్తుండడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేశ్ కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ధైర్యం ధర్మాస్పత్రి!

క్యాన్సర్.. పేద, మధ్య తరగతి ఇంట్లో పిడుగువంటిది. ఏ పూటకాపూట పని చేసుకుని ఉన్నంతలో బతికే కుటుంబాల్లో ఒక్కరు క్యాన్సర్ బారినపడినా ఆ కుటుంబంపై ఆర్థికంగా, మానసికంగా కోలుకోలేని దెబ్బపడుతుంది. వైద్యం చేయించడం లక్షలాది రూపాయలతో కూడుకున్నది. కళ్ల ముందే క్యాన్సర్ కణం తమ వారి శరీరాన్ని లోలోన తినేస్తుంటే చూస్తూ ఉండలేక.. చేతిలో చిల్లి గవ్వలేక తల్లడిల్లిపోయే వారికి ఇప్పుడు ధర్మాసుపత్రి ధైర్యాన్నిస్తోంది. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లోనే క్యాన్సర్ రోగులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటైంది. క్యాన్సర్ వార్డు, పాలియేటివ్ కేర్ సెంటర్ ఎన్నో కుటుంబాలకు ధైర్యాన్నిస్తున్నాయి.



ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు జీవితంపై కొత్త ఆశలు

- పాలియేటివ్ కేర్ సెంటర్, క్యాన్సర్ వార్డుల్లో చికిత్స
- పేద, మధ్య తరగతికి భారీ ఊరట
- త్వరలో అధికారికంగా క్యాన్సర్ వార్డు ప్రారంభం
- ప్రాథమికంగా అందుతున్న చికిత్స

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో సుమారు 1200 మందికిపైగా క్యాన్సర్ బారినపడినట్లు అధికారిక లెక్కలు పేర్కొంటున్నాయి. వారంతా జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు లేదా హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. కీమో థెరపీ, రేడియేషన్ థెరపీ చేయించుకోవడం, ఖరీదైన మందులు కొనుగోలు చేయడం చాలా కుటుంబాలపై ఆర్థికంగా తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే క్యాన్సర్ రోగులకు వైద్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స అందించేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఏడాది క్రితం ప్రారంభించిన పాలియేటివ్ కేర్ సెంటర్‌లోనే ప్రత్యేకంగా క్యాన్సర్ వార్డును ఏర్పాటు చేశారు.

ప్రారంభమైతే అన్ని రకాల వైద్యం..

జీజీహెచ్ ఆవరణలో క్యాన్సర్ వార్డు అధికారికంగా ప్రారంభమైతే రోగులకు అవసరమైన అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే క్యాన్సర్ బారిన పడిన రోగులకు చికిత్స అందిస్తున్నారు. అధికారికంగా ప్రారంభమైన తరువాత రోగులకు కీమో థెరపీ, రేడియేషన్ థెరపీ చేయడం తోపాటు అన్ని రకాల మందులు అందించనున్నారు. ఇది అన్నివర్గాల వారికి పెద్ద ఊరటనిచ్చే అంశం.

వైద్యులు.. సిబ్బంది

ప్రస్తుతం క్యాన్సర్ వార్డులో వైద్య నిపుణులు చైతన్యతోపాటు ఫిజియోథెరపిస్ట్, నలుగురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు చొప్పున అటెండర్లు, ఆయాలు, వాచ్‌మెన్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి నుంచే 24 గంటలపాటు వార్డు అందుబాటులో ఉంటోంది.

హలో.. ఆస్పత్రికి రండి



జీజీహెచ్ ఆవరణలో ఏర్పాటైన క్యాన్సర్ వార్డు అధికారికంగా ప్రారంభం కాలేదు. అయినప్పటికీ క్యాన్సర్ రోగుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తున్న వైద్య సిబ్బంది ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స అందిస్తున్నారు. రోగులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సిబ్బంది ఫోన్‌లు చేసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. కీమో, రేడియేషన్ థెరపీ కారణంగా చేయించుకున్న తరువాత వచ్చే తీవ్ర నొప్పులు, వీక్‌నెస్, ఇతర సైడ్ ఎఫెక్ట్‌లకు క్యాన్సర్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ, డ్రెస్సింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం 10 బెడ్‌లు ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న వారికి ఆ తరువాత సైడ్ ఎఫెక్ట్స్, నొప్పులు, ఇతర సమస్యలు వస్తే జీజీహెచ్‌కు వెళ్లాలని అక్కడి వైద్యులు రిఫర్ చేస్తున్నారు.



పాలియేటివ్ కేర్ సెంటర్

పాలియేటీవ్ కేర్ సెంటర్‌లో క్యాన్సర్, పక్షవాతం, కిడ్నీ ఫెయిల్, హార్ట్ ఫెయిల్ తదితర రోగాలకు సంబంధించి చికిత్స అందిస్తున్నారు. ఇక్కడే ఫిజియోథెరపీ పరికరాలు ఉన్నాయి. ప్రారంభమైన కొత్తలో సిబ్బంది కొరత కారణంగా అంతంతమాత్రంగానే సేవలు అందినప్పటికీ.. గత ఆరు నెలలుగా పూర్తిస్థాయి సేవలు అందుతున్నాయి. 24గంటలపాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.



అందిన సేవలు

హోమ్‌కేర్	4537
ఫిజియోథెరపీ	2821
అవుట్‌పేషెంట్	1604
ఇన్‌పేషెంట్	1302

నాలుగేళ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతున్నా



అనారోగ్యంతో బాధపడుతూ నాలుగేళ్ల కిత్రం రక్త పరీక్షలు చేయించుకోగా క్యాన్సర్ అని తేలింది. ఇప్పటి వరకు 20 కీమో, 25 రేడిషియేషన్ థెరపీ చేయించుకున్నా. మా భర్త ప్రభుత్వ టీచర్ కావడంతో ఈహెచ్‌ఎస్‌లో చేయించుకున్నా. మళ్లీ వీక్‌నెస్, ఇతర నొప్పులు రావడంతో చికిత్స కోసం వెళితే డబ్బులు ఖర్చయ్యేవి. ప్రభుత్వ ఆస్పత్రిలో అవసరమైన చికిత్స ఉచితంగా అందుతోంది. ఇక్కడ చాలా బాగుంది. – సురేఖ, మానిక్‌బండార్

ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకున్నా



క్యాన్సర్ నిర్ధారణ కావడంతో ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకున్నా. ఎనిమిది సార్లు కీమో, 25సార్లు రేడియేషన్ చేశారు. రెండు, మూడు నెలలకోసారి నొప్పులు వస్తున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే టెస్టులు, మందులు, ట్రీట్‌మెంట్‌కు రూ.10వేలకు పైనే ఖర్చవుతుంది. నొప్పులు, ఇతర సమస్యలకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందుతోంది. డాక్టర్ మూడు రోజులు ఉండమని చెప్పారు. భోజనం కూడా పెడుతున్నారు. – లింగాల సుగుణ, పడగల్

నాలుగేళ్ల క్రితం ఆపరేషన్ అయ్యింది



నాకు నాలుగేళ్ల క్రితం బ్రెయిన్ ఆపరేషన్ అయ్యింది. హైదరాబాద్‌లో సుమారు రూ.18 లక్షల వరకు ఖర్చు చేశాం. అప్పుడప్పుడు తలనొప్పితోపాటు ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. రెగ్యులర్‌గా హైదరాబాద్‌కు వెళ్లి చెకప్ చేయించుకుంటాను. జీజీహెచ్ నుంచి ఫోన్ చేసి ఇక్కడికే రమ్మంటున్నారు. మొదటి సారి వచ్చాను. ఇక్కడ చికిత్స బాగుంది.

– శశిరేఖ, న్యావనంది

ఉచితంగా వైద్య సేవలు



జీజీహెచ్‌లోనే క్యాన్సర్ రోగులకు ఉచితంగా వైద్య సేవలందుతాయి. ఇందుకోసం ప్రత్యేకంగా 10 బెడ్‌లతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. ప్రస్తుతానికి అవసరమైన వైద్యులు, సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు. పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. రోగులు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్

చిరుతల అలజడి

జిల్లాలో పెరిగిన సంచారం

- ఆహారం, నీటి కోసం అన్వేషిస్తూ అడవి నుంచి బయటికి..
- లేగదూడలు, మేకల మందలపై వరుస దాడులు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు, పశువుల కాపర్లు



చిరుత దాడిలో అబ్బాపూర్‌లో మృతి చెందిన లేగదూడ (ఫైల్)



నాగారం ప్రాంతంలో కనిపించిన చిరుత (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో చిరుతల అలజడి పెరిగింది. ఆహారం, నీటి కోసం సంచరిస్తూ అడవులు, గుట్టలను వదిలి జన సంచార ప్రాంతాల్లోకి వస్తున్నాయి. అలా వస్తున్న చిరుతలు పశువులు, మేకల మందలపై దాడులు చేసి చంపుతున్నాయి. దీంతో పశువుల కాపరులకు భయం పట్టుకుంది. ఇటీవల పలు రేంజ్‌ల పరిధిలో చిరుతలు ఎక్కువగా కనిపిస్తుండడంతో ఆ ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ జూలై నెలలోనే జరిగిన వరుస ఘటనలు అటవీ అధికారులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ట్రాప్ కెమెరాలు అందుబాటులో లేకపోవడంతో చిరుతలతోపాటు ఇతర వన్యప్రాణుల కదలికలను కనిపెట్టలేకపోతున్నారు. చిరుతలు ఎక్కువగా ఉన్న ఇందల్వాయి అటవీ రేంజ్‌లో 44వ నెంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఫెన్సింగ్ లేకపోవడంతో చిరుతలు హైవేపై సంచరిస్తున్నాయి.

ఈ నెలలోనే ఆరు ఘటనలు...

- 11వ తేదీన సిరికొండ మండలం తాటిపల్లి అడవుల్లో పెద్ద పులి సంచరించినట్లు ఫారెస్ట్ అధికారులు పాదముద్రలను గుర్తించారు. ఇక్కడి నుంచి వెళ్లిన పులి కామారెడ్డి జిల్లా మాచారెడ్డి రేంజ్ అడవుల్లో ఆవుపై దాడిచేసింది చంపింది. పెద్దపులి జాడ ఇంతవరకు లభించలేదు.
- 13వ తేదీన నిజామాబాద్ నార్త్ రేంజ్ పరిధిలోని నాగారం డంపింగ్‌యార్డు గుట్ట ప్రాంతంలో చిరుత కనిపించింది. స్థానికులు వీడియో తీసి అటవీ అధికారులకు సమాచారం అందించారు. తరుచూ ఇదే ప్రాంతంలో చిరుతలు సంచరిస్తుడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.
- 17వ తేదీన ఎడపల్లి మండలం జానకంపేట్ శివారులో మేకల మందపై చిరుత దాడి చేసి ఒక మేకను పట్టుకెళ్లింది. ఈ ఘటన మేకల కొట్టంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ఈ విషయాన్ని మేకల యజమాని సందీప్ అటవీ అధికారులకు తెలుపడంతో వారు చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అదే రోజున సిరికొండ మండలం పాకాల శివారులో జిట్టపులి లేగదూడపై దాడి చేసి చంపేసింది. డీఎఫ్‌వో నిఖిత మృతి చెందిన లేగదూడను పరిశీలించారు.
- జూలై 24, 26 తేదీల్లో నవీపేట్ మండలం నందిగామ, సిరన్‌పల్లి గ్రామాల్లో చిరుతలు సంచరించాయి. సిరన్‌పల్లిలో మేకల మందపై చిరుత దాడిచేసింది. నందిగామలో చిరుత పాదముద్రలు కనిపించగా, మరుసటి రోజే గుట్టపై చిరుత కనిపించింది. దీనిని స్థానికులు వీడియో, ఫొటోలు తీశారు.
- ఫిబ్రవరి 21న నవీపేట్ మండలం అబ్బాపూర్‌లో ఓ రైతుకు చెందిన పశువుల కొట్టంలోకి చొరబడిన చిరుత రెండు లేగదూడలపై దాడిచేసి చంపేసింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అడవుల్లోకి వెళ్లొద్దు

చిరుతల సంచారం పెరిగింది. ఒక చోటు నుంచి మరో చోటుకి వెళ్తున్నాయి. ఈ క్రమంలో అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామాల్లోకి వచ్చి మేకలు, పశువుల కొట్టాల్లోకి చొరబడి దాడి చేస్తున్నాయి. అడవుల్లోకి వెళ్లకుండా కొద్ది దూరం వరకే కాపరులు పశువులను తీసుకెళ్లాలి. చిరుత పులులు కనిపించిన వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. – సంజయ్‌గౌడ్, ఎఫ్‌ఆర్వో, నిజామాబాద్ నార్త్

పులి.. జాడేదీ?

- పక్షం రోజులుగా వెతుకుతున్నా ఫలితం శూన్యం
- కెమెరా కంటికీ చిక్కని వైనం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వచ్చిన అరుదైన అతిథి.. ఎటువెళ్లిందన్న విషయమై స్పష్టత రావడం లేదు. పక్షం రోజులుగా అటవీ అధికారులు వెతుకుతున్నా పెద్దపులి జాడ కనిపించడం లేదు. నిఘా కోసం ఏర్పాటు చేసిన కెమెరాలలోనూ ఎలాంటి ఆధారాలూ రికార్డు కాలేదు. దీంతో అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు భయంభయంగా గడుపుతున్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ రేంజ్ పరిధిలో పెద్దపులి సంచరించినట్లు ఈనెల 11వ తేదీన అటవీ అధికారులు పాదముద్రల ద్వారా నిర్ధారించారు. ఆ తరువాత కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్‌తండా అటవీ ప్రాంతంలో పక్షం రోజుల క్రితం ఓ ఆవుపై పులి దాడి చేసిన సంఘటన కలకలం రేపింది. దాడి చేసిన ప్రాంతంలో అడుగులను పరిశీలించిన అటవీ శాఖ అధికారులు.. అవి పులి వేనన్న తేల్చారు.

26 కెమెరాల ఏర్పాటు..

ఆవుపై దాడి చేసిన ప్రాంతానికి కొద్ది దూరంలో నలువైపులా కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. ఆ కెమెరాలు రాత్రింబవళ్లు పనిచేస్తాయి. ఆ ప్రాంతంలో పులి సంచరిస్తే కచ్చితంగా కెమెరాకు చిక్కుతుంది. దాదాపు 26 కెమెరాలు ఏర్పాటు చేసినట్టు అటవీ అధికారులు చెబుతున్నారు. కెమెరాలను రెగ్యులర్‌గా పరిశీలిస్తున్నారు. కానీ ఏ ఒక్కదానిలోనూ పులి సంచారం రికార్డు కాలేదు. పులి తిరుగుతున్న నేపథ్యంలో పశువులు, మేకల కాపరులు అడవి లోపలికి వెళ్లడం లేదు. బయట మేపుతున్నారు.



ఎస్సారెస్పీకి మహా వరద

- మహారాష్ట్రలోని విష్ణుపురి నుంచి నీటి విడుదల
- శ్రీరాంసాగర్‌లోకి 53 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: మహారాష్ట్రలోని విష్ణుపురి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. మహారాష్ట్ర ప్రాంతం నుంచి 48 వేల క్యూసెక్కులు, స్థానిక ఎగువ ప్రాంతాల నుంచి 5వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 53వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. శనివారం రాత్రి నుంచి ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం రాత్రికి వరకు 1070.8(25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

తొలిసారి 50 వేల క్యూసెక్కులు దాటి..

ప్రస్తుత సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు గరిష్ఠంగా 8,709 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో 50 వేల క్యూసెక్కుల నీరు దాటడం ఇదే తొలిసారి. ప్రాజెక్ట్‌లోకి అర లక్షకు పైగా వరద నీరు రావడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులపాటు ఇన్‌ఫ్లో కొనసాగితే ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతుందని అంటున్నారు.

ఇన్ ఫ్లో క్రమంగా పెరిగిందిలా.. (క్యూసెక్కుల్లో)	
శనివారం రాత్రి	12,000
ఆదివారం ఉదయం 6 నుంచి	24,000
మధ్యాహ్నం 12 నుంచి	37,000
సాయంత్రం 4 నుంచి	50,500
7 గంటల నుంచి	53,000



కందకుర్తి పుష్కర ఘాట్ వద్ద నీట మునిగిన శివాలయం

గోదావరిలో పెరిగిన వరద ఉధృతి

రెంజల్(బోధన్): మహారాష్ట్రతోపాటు స్థానికంగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి వరద ఉధృతి పెరిగింది. మన రాష్ట్రంలో గోదావరి తొలి ప్రవేశమైన కందకుర్తి వద్ద గోదావరితోపాటు మంజీరా నదులు కలువడంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కర క్షేత్రం వద్ద ఉన్న శివాలయం నీట మునిగింది. తెలంగాణ – మహారాష్ట్ర మధ్య గోదావరిపై నిర్మించిన వంతెనను ఆనుకుని నీరు పరవళ్లు తొక్కుతోంది. నది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో దండోరా వేయించారు.

క్లుప్తంగా

ప్రమాదపు అంచున పర్యాటకులు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరుతుండటంతో ప్రాజెక్ట్ సందర్శనకు పర్యాటకులు తరలివస్తున్నారు. కానీ పర్యాటకులు ప్రాజెక్టు లోపలికి వెళ్లడంతోపాటు, నీటి అంచున ఫొటో షూట్‌లు, సెల్ఫీలు దిగుతున్నారు. దీంతో పర్యాటకులు ప్రమాదవశాత్తు నీటమునిగే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రాజెక్టు అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రారంభమైన జెండా బాలాజీ జాతర



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెండాగల్లీలో గల వేంకటేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం సర్వసమాజ్ ఆధ్వర్యంలో జెండా బాలాజీ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా జెండాతో ఆలయం చుట్టు ఐదు ప్రదిక్షణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ప్రతిష్ఠించారు. భక్తులు 9రోజుల పాటు ఆలయంలోని జెండాకు పూజలు చేయనున్నారు. అంతకుముందు జెండాతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆగస్టు 5న జెండాను అంకాపూర్ గ్రామస్తులకు అప్పగించనున్నారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో జెండాకు ప్రత్యేక పూజలు చేశారు. అధ్యక్షుడు కొట్టాల సుమన్, ప్రధాన కార్యదర్శి కర్తన్ దినేష్, సర్వ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఆవు పాల పంపిణీ



నిజామాబాద్ రూరల్: నాగుల పంచమిని పురస్కరించుకొని ఈ నెల 29న గోకుల్ గో సేవా సమితి ఆధ్వర్యంలో ఇందూరు నగరంతోపాటు పలు గ్రామాల్లో 70 ఆవుపాల పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు టీ రామ్మోహన్ తెలిపారు. నగరంలోని పెద్ద రాం మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం 6.30 నుంచి ఆవు పాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో సమితి సభ్యులు శంకర్, శ్రీధర్, దయాకర్, సతీశ్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇందూరు గోసేవా సమితి ఆధ్వర్యంలో ఆవు పాలు పంపిణీ చేస్తున్నట్లు అధ్యక్షుడు వీరమల్లు రమేశ్ తెలిపారు. ఆదివారం సమితి కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. లక్ష్మీకాంతం, కోట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'నిజాంసాగర్'లోకి ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,828 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,391 అడుగుల (4.47 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

అవస్థల ప్రయాణం ఇంకెన్నాళ్లు?

- రెండున్నరేళ్లుగా సాగుతున్న మాధవ్‌నగర్ ఆర్వోబీ పనులు
- గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టని అధికారులు



మాధవనగర్ రహదారిపై ఏర్పడ్డ గుంతలు





మాధవనగర్ ఆర్వోబీ రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా గుంతలమయం కావడంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరంత గుంతల్లో చేరింది. దీంతో వాహనదారులు గుంతలను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మాధవగర్ ఆర్వోబీ పనులు ప్రారంభమై దాదాపు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా కొన సాగుతునే ఉన్నాయి. ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా రోడ్డుపై అక్కడక్కడ తవ్వకాలు జరిపి, పలు నిర్మాణాలు చేపట్టారు. తవ్వకాలను మొరంతో పూడ్చివేసినా, పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టలేదు. అలాగే నిత్యం వాహనాల రాకపోకలు, వర్షాల కారణంగా రోడ్డంతా పూర్తిగా అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గుంతలతోపాటు, పలు చోట్ల రోడ్డు కోతకు గురవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అంతేకాకుండా రైల్వేగేటు పడితే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. తలమయమైన రోడ్డు గురించి ఇది వరకే ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని ప్రయాణికులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు.

సూచికలు, లైటింగ్ కరువు...

ఆర్వోబీ పనులు జరిగే చోట ఎలాంటి ప్రమాద, ప్రయాణ సూచికల బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు అయోమయంలో పడుతున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే ప్రయాణికులు ఆర్వోబీ పనుల వద్ద సూచిక బోర్డులు లేక ఎటునుంచి వెళ్లాలో తెలియక స్థానికులను అడిగి వెళ్లే దుస్థితి ఏర్పడింది. అలాగే లైటింగ్ సౌకర్యం లేకపోవడంతో రాత్రివేళలో వాహనదారులు రోడ్డు సరిగా కనబడక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆర్వోబీ పనుల వద్ద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షపాతాన్ని ఎలా కొలుస్తారు?

మీకు తెలుసా?



రెయిన్ గేజ్ (వర్షమాపకం)

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎప్పుడైన వర్షం కురిస్తే, ఎంత కురిసిందో వాతావరణ శాఖ మాత్రమే చెబుతుంది.

- వర్షపాతాన్ని తెలుసుకునేందుకు రెయిన్ గేజ్‌లను (వర్షమాపకాలు) ఉపయోగిస్తారు. వాటిని వాతావరణ ప్రధాన కేంద్రమైన పూణేలో ప్రత్యేక ల్యాబ్‌లో తయారు చేస్తారు.
- రెయిన్ గేజ్‌లలో రెండు రకాలున్నాయి. ఒకటి సెల్ఫ్ రికార్డింగ్ రెయిన్ గేజ్. దీనిని నేలపై బోరు పైపులా ఏర్పాటు చేస్తారు. పైపులో గ్రాఫ్ రోలర్ బిగించి ఉంచుతారు. వర్షం పడిన సమయంలో నీరు సన్నని రంధ్రంలోకి చేరడం వలన ఎప్పటికప్పుడు గ్రాఫ్‌లో నమోదు చేస్తుంది.
- రెయిన్ గేజ్‌లో రెండో రకం ఆర్డినరీ రెయిన్ గేజ్. ఇది ప్రతి మూడు గంటలకోసారి వర్షపాతాన్ని నమోదు చేస్తుంది. ఉదయం 8:30 గంటలకు, 11:30 గంటలకు మధ్యాహ్నం 2:30 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు వర్షపాతాన్ని తీస్తారు.
- ఇదే పద్ధతిలో రాత్రి నుంచి వేకువజాము వరకు కూడా మూడు గంటలకోసారి కొలుస్తారు.
- ఈ ఆర్డినరీ రెయిన్ గేజ్‌లు ప్రతి మండలానికి ఒకటి తహసీల్ ఆఫీసు ఆవరణలో ఉంటుంది. అలాగే సబ్ స్టేషన్లలో కూడా ఉంటాయి.
- వీటి రక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్ ఉంటుంది. చూడటానికి బోరు పైపు మాదిరిగా ఉంటుంది. సన్నని రంధ్రం ద్వారా వర్షపునీరు వెళ్లి లోపల ఉన్న ఒక కంటెయినర్ (డబ్బా)లో చేరుతుంది.
- అలా డబ్బాలోకి చేరిన నీటిని ప్లాస్క్ మగ్‌లోకి పోసి కొలుస్తారు. వర్షపాతాన్ని మిల్లీ మీటర్లు, సెంటీ మీటర్లలో కొలుస్తారు. 10 మిల్లీ మీటర్లకు ఒక సెంటీ మీటరు అంటారు.
- ఈ వర్షపాతం వివరాలను సేకరించి ప్రభుత్వాలకు పంపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుంటారు. వాతావరణ శాఖ నుంచి సైంటిఫిక్ అసిస్టెంట్లు, ముఖ్య ప్రణాళిక శాఖ నుంచి అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో)లు ఉంటారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి



పట్టణ ఆర్యవైశ్య నూతన కార్యవర్గ సభ్యులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, మాజీ ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్ నాగారం: ఆర్య వైశ్యులు రాజకీయంగా ఎదగాలని, ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని శ్రీరామగార్డెన్‌లో ఆదివారం ఆర్యవైశ్య పట్టణ సంఘం, అనుబంధ సంఘాల విజయోత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. ఆర్యవైశ్యులు అంటేనే సమాజంలో సేవకు మారు పేరుగా నిలిచారన్నారు. అన్నదాన కార్యక్రమాల నుంచి విద్య, వైద్యం, ఆధ్యాత్మికంగా అన్ని రంగాలలో సేవలందించడంలో ముందుంటారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఈ ఆర్య వైశ్య పట్టణ సంఘం ఎన్నికల గురించి కొంత మంది ఎక్కువ ఆలోచిస్తున్నారన్నారు. ఆలా అలోచించి చివరికి నవ్వులపాలు కావద్దని విజ్ఞప్తి చేశారు. నూతనంగా గెలిచిన వారందరిని అభినందిస్తూ, ఈ గెలుపుతో తమ బాధ్యత మరింత పెరిగిందనే విషయం గుర్తుపెట్టుకోవాలని వారికి సూచించారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్ గుప్తా, ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్ గుప్తా, ప్రధానకార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి అన్నారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో 'మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి' అనే సందేశంతో రూపొందించిన వాల్ పోస్టర్‌లను లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి విజయ్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో అతికించారు. మత్తు పదార్థాలపై యువత, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

మంకీ గన్లకు భలే గిరాకీ..!



ఎల్లారెడ్డి: కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. కోతుల నివారణకు మంకీ గన్లు బాగా ఉపయోగపడుతుండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు. పట్టణంలో మంకీ గన్లు విక్రయించేందుకు రావడంతో స్థానికులు వాటిని కొనుగోలు చేశారు. సుమారు రూ.150కి విక్రయదారులు అమ్ముతున్నారు. మంకీగన్లలో సున్నపురాయిని వేసి దానిలో రెండు చుక్కల నీటిని పోసి అటు ఇటు తిప్పి లైటర్‌ను ఆన్‌చేస్తే భారీ శబ్దం రావడంతో కోతులు పారిపోతున్నాయని స్థానికులు తెలిపారు.

ఉపాధి ఎరవేసి.. ఇరికించారు

- ఏజెంట్ల మోసానికి బలైన పడిగెల వాసి
- బాధితుడి పేరిట దుబాయ్‌లో ఇల్లు అద్దె
- తిరిగి వచ్చేందుకు ఇబ్బందులు
- ఏజెంట్లపై కేసు నమోదుకు ప్రవాసీ ప్రజావాణి ఇన్‌చార్జి సూచన



ఎన్‌ఆర్‌ఐ సలహా మండలి చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): యూరప్‌లో ఉపాధి కల్పిస్తామంటూ ఏజెంట్లు చెప్పిన మాటలను నమ్మి వెళ్లిన వేల్పూర్ మండలం పడిగెల గ్రామానికి చెందిన గంగాప్రసాద్ దుబాయ్‌లో చిక్కుకుపోయాడు. మూడేళ్లుగా స్వదేశానికి రాలేక ఇబ్బందులు పడుతున్నాడు. ప్రభుత్వం స్పందించి తమ కుమారుడిని ఎలాగైనా ఇంటికి రప్పించాలని కోరుతూ బాధితుడి తండ్రి భోజన్న, అన్న ప్రసాద్ హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించారు. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డిల సహకారంతో ప్రవాసీ ప్రజావాణి ఇన్‌చార్జి, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి ఇటీవల వినతిపత్రం అందజేశారు. దీంతో గంగాప్రసాద్‌ను మోసగించిన ఏజెంట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చిన్నారెడ్డి పోలీసులకు సూచిస్తూ లేఖ రాశారు. దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడి బాధితుడిని రప్పిస్తామని హామీ ఇచ్చారు.

యూరప్ పేరిట గాలం..

పడిగెల గ్రామానికి చెందిన గంగాప్రసాద్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిగ్రీ పూర్తి చేశాడు. మూడేళ్ల కిందట యూరప్‌లోని హోటల్ రంగంలో ఉపాధి కల్పిస్తామని నమ్మించిన ఇద్దరు ఏజెంట్లు గంగాప్రసాద్ నుంచి రూ.8.77 లక్షలు వసూలు చేశారు. మొదట దుబాయ్‌లో ఆరు నెలలపాటు ఉంటే అక్కడి నుంచి యూరప్ తరలిస్తామని చెప్పారు. ఏజెంట్ల మాటలు నమ్మిన గంగాప్రసాద్ దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ ఓ డమ్మీ కంపెనీలో ప్రసాద్‌కు ఐటీ మేనేజర్‌గా ఉద్యోగం ఇచ్చినట్లు నకిలీ ఐడీ కార్డును అందజేశారు. అదే ఐడీ కార్డుతో బ్యాంకు ఖాతా తెరిపించి చెక్‌బుక్ తీసుకున్నారు. ఆ చెక్కులపై గంగాప్రసాద్‌తో సంతకాలు చేయించుకొని అతని పేరిట షార్జాలో ఓ ఇల్లును అద్దెకు తీసుకున్నారు. ఆరు నెలల తర్వాత యూరప్ పంపే విషయమై అడిగితే దాటవేస్తూ వచ్చారు. దీంతో అక్కడే ఉంటూ బయట వంట మనిషిగా పనిచేస్తూ వచ్చాడు. స్వదేశానికి వచ్చేందుకు ఏప్రిల్ 13న దుబాయ్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా గంగాప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. షార్జాలో ఇంటి ఒప్పందం చేసుకొని ఇచ్చిన చెక్కులు చెల్లలేవని, దీంతో కేసు నమోదైనట్లు స్పష్టం చేశారు. ఇంటి అద్దె ఒప్పందంలో భాగంగా 27వేల ధరమ్స్ చెల్లించాలని వెల్లడించారు. మొదట బెయిల్ ఇవ్వడానికి 4వేల ధరమ్స్‌ను ప్రసాద్ కుటుంబసభ్యులు షార్జాకు పంపించారు. ఇంకా 23వేల ధరమ్స్(రూ.5.4లక్షలు)చెల్లించాల్సి ఉంది. కాగా, గంగాప్రసాద్ పేరిట భవనాన్ని అద్దెకు తీసుకున్న ఏజెంట్లు.. థర్డ్ పార్టీకి అద్దెకు ఇచ్చి తమ జేబులు నింపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐక్యతతోనే బంజారాల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): బంజారా (లంబాడి)లు అందరూ ఐక్యతతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సబావత్ రాములు నాయక్ అన్నారు. మండలంలోని బర్దిపూర్ శివారులో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బంజారా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి రాములు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బంజారాల సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు జీవితం అంకితం చేసిన రామారావు మహారాజ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బంజారాలు అత్యధిక స్థానాలను గెలిచి రాజకీయంగా రాణించడంతో పాటు తండాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ నాయకులు, మాజీ ఎంపీ సోయం బాపురావు ఎస్టీ జాబితా నుంచి బంజారాలను తొలగించాలని సుప్రీంకోర్టులో కేసు వేశారని బంజారాలందరూ ఐక్యతతో ఆయన కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏబీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఉమేష్ జీ.జాదవ్ మాట్లాడుతూ.. బంజారాలకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీహరి నాయక్, కిషన్‌సింగ్ రాథోడ్, పాండునాయక్, రామారావు, మోహన్ నాయక్, పీర్‌సింగ్, రవికుమార్, రాంచందర్ నాయక్, పుసల నరహరి బదావత్, సబావత్ శివలాల్ నాయక్, మోతీలాల్, జాదవ్ ఓమాజీ, దశరథ్, శివలాల్, చాంగీబాయి తదితరులు ఉన్నారు.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు



అర్గుల్ జెడ్పీహెచ్ఎస్ 2001-02 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

- జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు

సాక్షి నెట్‌వర్క్: ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.





ధర్పల్లి జెడ్పీహెచ్ఎస్ 2008-09 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు.. పడకల్ జెడ్పీహెచ్ఎస్ 2009-10 బ్యాచ్

అక్క బాగు కోసం.. బావ మృతికి కారణమై..

- కటకటాల పాలైన నిందితుడు

సిరికొండ: ఆత్మహత్యకు యత్నించిన బావను ఆస్పత్రికి తీసుకెళ్లకుండ, పొదల్లో వదిలేసి, మృతికి కారణమైన నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరికొండ ఎస్సై రామకృష్ణ ఆదివారం వివరాలు వెల్లడించారు. మండలంలోని మైలారం గ్రామ శివారులో ఈ నెల 25న లభ్యమైన వ్యక్తి మృతదేహం కేసులో విచారణ చేపట్టి, ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. మృతుడిని ఖాజామోహీనొద్దీన్(43)గా గుర్తించగా, అతడు మంకమ్మతోట కరీంనగర్‌కు చెందిన వ్యక్తి కాగా ఆర్మూర్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. అతడు తరచు మద్యం తాగుతూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో ఖాజామోహీనొద్దీన్ ఈ నెల 23న రామన్నపేట్‌లో సెంట్రింగ్ పని చేసేచోట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో అతడి బావమరిది షేక్ లాయక్ అలియాస్ బబ్లు అక్కడే ఉన్నాడు. అతడు బావను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా, చనిపోతేనే తన అక్క బాగుంటుందని భావించాడు. దీంతో మరో వ్యక్తి అబ్దుల్ జబ్బర్ సాయంతో అతడు మృతదేహాన్ని బైక్‌పై మైలారం శివారులోని చెరువు కట్టపై వదిలేసి వెళ్లిపోయారు. మృతుడికి సరైన వైద్యం అందించకుండా మృతికి కారణమైన షేక్ లాయక్, అబ్దుల్ జబ్బర్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ధర్పల్లి సీఐ భిక్షపతి, సిరికొండ ఎస్సై, సిబ్బందిని ఏసీపీ అభినందించారని ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

దుబాయ్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహం

- తలకొరివి పెట్టిన తల్లి



నీరడి భోజన్న (ఫైల్)

డిచ్‌పల్లి/ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దుబాయ్‌లో కొన్ని రోజుల క్రితం మృతిచెందగా ఆదివారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి గ్రామానికి చెందిన నీరడి భోజన్న (44) ఉపాధి నిమిత్తం కొన్ని రోజుల క్రితం దుబాయి వెళ్లాడు. 20 రోజుల క్రితం అనారోగ్యానికి గురై, గుండెపోటు రావడంతో అక్కడి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబాయ్‌లోనే ఉంటున్న అతడి తమ్ముడు మృతదేహాన్ని గ్రామానికి పంపించేందుకు కంపెనీ చుట్టూ తిరిగిన పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న యూఏఈ తెలుగు హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ కంపెనీ వారితో మాట్లాడగా, మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు సహకరించింది. ఆర్గనైజేషన్‌కు చెందిన అజ్మన్ ఇన్‌చార్జి భూమేష్ సహకారంతో అన్ని రకాల అనుమతులు తీసుకున్నారు. మృతుడు తమ్ముడికి టికెట్టు సమకూర్చి మృతదేహాన్ని ఇండియాకు పంపించారు. ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న మృతదేహానికి తల్లి లింగవ్వ తలకొరివి పెట్టింది. మృతుడు భోజన్నకు భార్య సుమ (ప్రస్తుతం నిండు గర్భిణీ), ఒక కూతురు ఉంది. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు, తెలుగు హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ సభ్యులు కోరుతున్నారు.

పోచారంలో పోచమ్మ గుడి, పుట్ట ధ్వంసం

బోధన్: ఎడపల్లి మండలం పోచారం గ్రామ శివారులో చెట్ల కింద ఉన్న నాగదేవత పుట్ట, పోచమ్మ గుడిని గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీతో తవ్వేశారని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు ఆదివారం ఉదయం గుడి వైపు వెళ్లగా ఆలయ ధ్వంసంను గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ప్రతి ఏటా నాగుల పంచమినాడు గ్రామంలోని మహిళలు ఇక్కడి పుట్టకు పూజలు చేసి పాలుపోస్తారని మంగళవారం నాగుల పంచమి ఉండగా పుట్ట ధ్వంసం కావడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎడపల్లి ఎస్సై రమా సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆలయ పునఃనిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



బాల్కొండ: మండల కేంద్రంలోని తాళం వేసిన రెండిళ్లలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, ఎస్సై శైలెందర్ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పుట్టి సుమంతి ఇంటికి తాళం వేసి ఉండగా శనివారం అర్ధరాత్రి దుండగులు తాళం పగులగొట్టి, ఇంట్లోని 6.7 తులాల బంగారం, ఆరు తులాల వెండి, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే అదే గ్రామంలోని తాళం వేసి ఉన్న సంతోష్ గౌడ్ ఇంట్లోకి దుండగులు చొరబడి నగదును చోరీ చేశారు. ఉదయం స్థానికులు చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శైలెందర్ సిబ్బందితో వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ వైరు..

ధర్పల్లి: మండల కేంద్రం శివారులోని పంట పొలాల వద్ద సుమారు 20 వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఆదివారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు సబ్‌మెర్సిబుల్ మోటారు నుంచి మెయిన్ బోర్డ్ వరకు ఉండే కేబుల్ వైర్లు కట్ చేసి ఉండడాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వారు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు. పంటలకు నీరు పెట్టాలంటే మళ్లీ ప్రతి మోటార్‌కు కేబుల్ వైరు కొనాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు రాత్రి సమయంలో గట్టి నిఘా పెట్టి దొంగలను పట్టుకుని కేబుల్ వైర్ చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న లారీ



రుద్రూర్: పోతంగల్ చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం ఓ కంకర లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొని బోల్తా పడింది. బీర్కూర్ నుంచి కోటగిరి మండలం ఎత్తోండకు కంకర లోడ్‌తో లారీ బయలుదేరింది. పోతంగల్ శివారులో మూల మలుపు వద్ద లారీ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో రెండు స్తంభాలు విరిగిపోగ, మరో రెండు దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా ఉండగా, వెంటనే అధికారులు సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనపై విద్యుత్‌శాఖ ఏఈ ఫక్రుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.80 వేల నష్టం జరిగినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డట్లు స్థానికులు తెలిపారు.

నకిలీ నంబర్‌ప్లేట్‌తో సంచారం

వాహనదారుడిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం: నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనాన్ని నడుపుతున్న వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌లోని వినాయక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల స్కూటీని కొనుగోలు చేశాడు. నిజామాబాద్‌లోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అదే నంబర్ ప్లేట్‌తో కామారెడ్డిలో మరో వ్యక్తి బైక్‌ను నడుపుతున్నాడు. ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులు దీనిని గమనించి అతడిని, వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ చలానాలు తప్పించుకోవడం, నేరం చేసినా దొరకకుండా ఉండడం కోసమే నంబర్ ప్లేట్ మార్చుకుని తిరుగుతున్నాడని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: బోర్గాం(పి)లోని గూడెం కాలనీకి చెందిన రామకృష్ణ ఇంట్లో ఇంట్లో శనివారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనతో మంటలు వ్యాపించడంతో ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ. 6లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు రామకృష్ణ తెలిపారు. దీనిపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.